W W W.EPAPER.MAHADAILY.COM

# మహా పత్రిక



ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం

10-10-2025



## రైతులకు ఊరట

తెలంగాణ రాష్ట్రం రైతుల కోసం మరోసారి పెద్ద ఊరటను తెచ్చింది. కేంద్రం మద్దతు ధర ప్రకటించినప్పటికీ కొనుగోళ్లు ఆలస్యమవుతున్న నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వమే మొక్కజొన్న పంటను కొనుగోలు చేయడానికి ముందుకు రావడం గమనార్హం·

05



07

## టెన్త్ పరీక్షల షెడ్యూల్ విడుదల

### మార్చి 16 నుండి పరీక్షల ప్రారంభం

తెలంగాణ రాష్ట్ర విద్యార్ధులకు ఈ ఏడాది పదో తరగతి పరీక్షల షెడ్యూల్ ను అధికారికంగా విడుదల చేసింది. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు మార్చి 16న ప్రారంభమవుతాయి. ఫస్ట్ లాంగ్వేజ్ పరీక్ష (తెలుగు, హిందీ, ఉర్దూ, కన్నడ, తమిళ్, ఒడియా, కంపోజిట్ కోర్సు) నిర్వహించబడుతుంది. ఆ తర్వాత మార్చి 18న సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష (హిందీ, తెలుగు, స్పెషల్ ఇంగ్లీష్) ఉంటుంది. మార్చి 21న ఇంగ్లీష్ పరీక్ష నిర్వహించ బడనుంది.



08

## ఖమ్మం జిల్లాలో ఘోర హత్య

- యువకుడి ముక్కలుగా విసిరిన దుండగులు
- యూట్యూబ్ ఆధారంగా ఘాతుకం
- హత్య కేసు ఫొరెన్‌ఫిక్ రహస్యాలు వెలుగు
- నిందితులు అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఏసిపి


ఖమ్మం జిల్లా రూరల్ ప్రాంతంలో ఘోరమైన హత్య ఘటన చోటుచేసుకుంది. ఏసీపీ తిరుపతి రెడ్డి గురువారం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు.



03

## పత్తి రైతులకు శుభవార్త!

ఖమ్మం జిల్లా పత్తి రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం , కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థ కలసి నూతన సీజన్‌కు కీలక మార్గదర్శకాలను జారీ చేశాయి. ఈ సీజన్ (2025-26) లో రైతులు తమ పత్తి పంటను ప్రభుత్వ నిర్దేశిత కనీస మద్దతు ధర వద్ద సీసీఐ కేంద్రాల ద్వారా అమ్ముకునే సౌకర్యం కల్పించబడింది.




08

# హైకోర్టు షాక్ ఆశలకు బ్రేక్

### ఆరువారాల తర్వాతే ఎన్నికలు.. నైరాశ్యంలో రాజకీయ నేతలు

హైకోర్టు స్థానిక ఎన్నికలకు బ్రేక్ వేయడంతో వీటిపై ఆశలు పెట్టుకున్న నేతలు, ఇప్పటికే ఖర్చయిపోయిన నేతలు ఖంగుతిన్నారు. ఈసారి ఎలాగైనా పదవి ఎక్కాలనుకున్న నేతలు.. సీన్ రివర్స్ కావడంతో నైరాశ్యంలో కూరుకుపోయారు. స్థానిక సంస్థల ఎన్నికలు, తెలంగాణ హైకోర్టు ఆదేశం కారణంగా ఆరు వారాల పాటు వాయిదా పడ్డాయి. ఈ అనూహ్య పరిణామం ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయ వాతావరణంలో పెద్ద మార్పును తీసుకువచ్చింది. జిల్లాలోని 571 గ్రామ పంచాయితీలు, 250 ఎంపీటీసీ స్థానాలు, 20 జెడ్పీటీసీ స్థానాలకు జరగాల్సిన ఎన్నికలు తెలంగాణ హైకోర్టు ఆదేశం వల్ల తాత్కాలికంగా ఆగిపోయాయి. ఈ తాత్కాలిక విరామం నాలుగు వారాల పాటు ఉంటుంది. నామినేషన్లకు సిద్దమైన నేతలు.. హైకోర్టు బ్రేక్ తో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు.

ఖమ్మం, మహా

### అయ్యో.. అయ్యయ్యో

ఎన్నికల ప్రక్రియలో ఉన్న ఉత్సాహం, హడావుడి, సభా సమావేశాలు, వ్యూహ చర్చలు ఒక్కసారిగా నిలిచిపోయాయి. కొంతమంది నాయకులు ఈ విరామాన్ని తాత్కాలిక ఊరటగా భావిస్తుంటే, మరికొందరు ఇంత వేగంగా ఉత్సాహం ఆగిపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మండలాల్లో పొత్తుల ఘర్షణలు మరియు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ తాత్కాలికంగా సడలించాయి.







# నామినేషన్ల స్వీకరణకు కేంద్రం సిద్ధం

**మణుగూరులో నామినేషన్లు స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి**

- కేంద్రం వద్ద బందోబస్తు పటిష్ఠం
- హెల్ప్‌డెస్క్‌లతో అధికారులు అలర్ట్

**మణుగూరు, మహా:** తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల నేపథ్యంలో మణుగూరు సబ్‌డివిజన్‌లో నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. అభ్యర్థులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నామినేషన్లు దాఖలు చేసుకునేం దుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మణుగూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రధాన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని జిల్లా పరిషత్ సీఈవో చంద్రశేఖర్ గురువారం పరిశీలిం చారు. కేంద్రంలోని సిబ్బందికి నామినేషన్ ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. అభ్యర్థులు తప్పుగా నామినేషన్లు దాఖలు చేయకుండా ఉండేందుకు హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసి, సిబ్బందిని అందుబాటులో ఉంచారు. అదే విధంగా, మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ నాగబాబులు నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. కేంద్రాల వద్ద పటిష్ఠమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసి, ఎటువంటి అసాంఘిక సంఘటనలకు తావివ్వకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు సిబ్బందికి సూచనలు చేశారు.

## నామినేషన్ల షెడ్యూల్ వివరాలు..

జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వివరాలు ఇలా ఉన్నాయి. మొదటి విడతగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు ఈ నెల 9 నుంచి 11 వరకు నామినేషన్ల స్వీకరణ. ఈ నెల 12న నామినేషన్ల పరిశీలన. ఈ నెల 15 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు. ఈ నెల 23న తొలి విడత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు. నవంబర్ 11న ఓట్ల లెక్కింపు జరగనుంది.

# అక్టోబర్ 23 లోపు మ్యానువల్ స్కావెంజర్స్‌పై అభ్యంతరాలు అందించాలి

**ఖమ్మం, మహా:** అక్టోబర్ 23 లోపు మ్యానువల్ స్కావెంజర్స్ పై అభ్యంత˘రాలు అందించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి గురువారం తెలిపారు. సుప్రీం కోర్టు ఉత్తర్వులు, భారత ప్రభుత్వం జారీ చేసిన మాన్యువల్ స్కావెంజర్స్ యొక్క మార్గదర్శకాలను అనుసరించి మాన్యువల్ స్కావెంజర్స్ రిహాబిలిటేషన్ చట్టం 2013 ప్రకారం మాన్యువల్ స్కావెంజర్ సర్వే కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని, జిల్లా స్థాయి అధికారులు నిర్వహించిన సర్వేలో ఖమ్మం జిల్లాలో ఎటువంటి మ్యానువల్ స్కావెంజర్స్ గుర్తించలేదని తెలిసిందని దీనిపై ఏదైనా అభ్యంతరాలు ఉంటే అక్టోబర్ 23 సాయంత్రం 5.00 గంటల లోపు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి కార్యాలయం, కలెక్టరేట్, రూమ్ నెంబర్ -34 నందు తెలియజేయాలని కలెక్టర్ తెలిపారు. అక్టోబర్ 23 సాయంత్రం ఐదు గంటల వరకు ఎటువంటి అభ్యంతరాలు రాకపోతే ఖమ్మం జిల్లాను మాన్యువల్ స్కావెంజర్స్ లేని జిల్లాగా ప్రకటించడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

# యువజన సమస్యలపై సమరశీల పోరాటాలకు సిద్ధం



**నెలకొండపల్లి, మహా:** యువజన సమస్యలపై రానున్న కాలంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో సమరశీల పోరాటాలకు యువత సిద్ధం కావాలని డివైఎఫ్ఐ పాలేరు డివిజన్ అధ్యక్షురాలు భూక్య వనజ రాథోడ్ పిలుపునిచ్చారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ ) పాలేరు డివిజన్ నూతన అధ్యక్షులుగా మండలంలోని మోటాపురం గ్రామానికి చెందిన భూక్య వనజ రాథోడ్ గత బుధవారం తిరుమలయపాలెం మండలంలోని పిండిప్రోలు గ్రామంలో జరిగిన 13వ మహాసభలలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తొలుత డివైఎఫ్ఐ పతాకాన్ని సంఘం సీనియర్ నాయకులు పొన్నం మురళి ఆవిష్కరించారు. అనంతరం విప్లవ వీరులు భగత్ సింగ్, చేగువేరా చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జరిగిన మహాసభలో 27 మందితో కూడిన నూతన డివిజన్ కమిటీని, 13 మందిని ఆఫీస్ బేరర్స్ గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం స్థానిక రావెళ్ల సత్యనారాయణ భవనంలో జరిగిన సంఘం మండల కమిటీ సమావేశంలో డివైఎఫ్ఐ పాలేరు డివిజన్ నూతన అధ్యక్షురాలు భూక్య వనజ రాథోడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువజన, నిరుద్యోగ సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని విమర్శించారు. దేశ భవిష్యత్తును నిర్దేశించే యువత పట్ల వారికి ఉపాధి ఉద్యోగాలు కల్పించడంలో ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా యన్నారు. ఫలితంగా సమాజ అభివృద్ధిలో కీలక భూమిక పోషించాల్సిన యువత నేడు చదువును నిర్లక్ష్యం చేస్తూ, సామాజిక బాధ్యతలను విస్మరించి, చెడు వ్యసనాలకు బానిసలై తమ విలువైన జీవితాలను విచ్ఛిన్నం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం, దేశం సమాజం అభివృద్ధి సాధించాలంటే పాలకులు యువత పట్ల సరైన దృష్టి సారించాలని, సామాజిక చైతన్యాన్ని పెంచాలన్నారు. నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం యువత ఆశలను నిర్వీర్యం చేస్తూ మతం పేరుతో కులం పేరుతో వారి మధ్య అంతరాలను సృష్టిస్తూ రాజకీయ పబ్బం గడుపుతుందన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీలను విస్మరించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ఈ సమావేశంలో సంఘం డివిజన్ నాయకులు రాసాల నవీన్, దొండా నరసింహారావు, బొడ్డు వెంకటేశ్వర్లు (సెల్వరాజ్), షేక్ జానీ, పెదపాక వినయ్, రాయపాటి సిద్దు, కొలికపొంగు సుదీర్ తదితరులు పాల్గొన్నారు.

### మణుగూరు పిహెచ్ సీ ఆధ్వర్యంలో..

# టొబాకో ఫ్రీ యూత్ కార్యక్రమం

**మణుగూరు, మహా:** మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మణుగూరు పరిధిలో గల అన్ని ఆరోగ్య ఉప కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొని టొబాకో అవగాహన ర్యాలీ తీశారు. మీరు కాల్చుచున్నది సిగరెట్ కాదు - మీ జీవితాన్ని, ధూమపానం వద్దు - జీవితమే ముద్దు, పొగాకు కు దూరంగా ఉండండి - ఆరోగ్యంగా జీవించండి వంటి నినాదాలతో ప్రజల్లో అవగాహన కల్పించారు. ర్యాలీలో డాక్టర్ సునీల్, ఆరోగ్య పర్యవేక్షకులు, అనిత, విజయ, సరోజ, రాజు తదితరు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీల్ మాట్లాడుతూ యువత పొగాకు ఉత్పత్తుల వినియోగం మానుకోవాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.





# పత్తి రైతులకు సీసీఐ శుభవార్త!

## క్వింటాల్‌కు ?8110 మద్దతు ధర.. "కపాస్ కిసాన్" యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ సౌకర్యం

**ఖమ్మం, మహా:** ఖమ్మం జిల్లా పత్తి రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం , కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థ కలిసి నూతన సీజన్‌కు కీలక మార్గదర్శకాలను జారీ చేశాయి. ఈ సీజన్ (2025-26) లో రైతులు తమ పత్తి పంటను ప్రభుత్వ నిర్దేశిత కనీస మద్దతు ధర వద్ద సీసీఐ కేంద్రాల ద్వారా అమ్ముకునే సౌకర్యం కల్పించబడింది. క్వింటాల్‌కు ?8110 వరకు ధర లభించనున్న ఈ సీజన్‌లో పారదర్శక కొనుగోలు విధానానికి ప్రాధాన్యత ఇస్తూ, రైతుల సౌకర్యార్థం "కపాస్ కిసాన్ మొబైల్ యాప్" ద్వారా ముందస్తు స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేయడం విశేషం. ఖమ్మం జిల్లాలో ఈసారి 2,25,613 ఎకరాల్లో పత్తి సాగు జరగగా, వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం 2,70,735 మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి ఉండబోతోందని అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో రైతులు తమ పంటను సరైన విధంగా నమోదు చేయించుకొని, నాణ్యత ప్రమాణాలను పాటించి, సీసీఐ కేంద్రాల్లో విక్రయిస్తే పూర్తి మద్దతు ధర పొందగలరని వ్యవసాయ శాఖ సూచించింది. 2025-26 మార్కెటింగ్ సీజన్‌లో ఖమ్మం జిల్లా రైతులకు సీసీఐ మంచి అవకాశాన్ని కల్పించింది. భారత పత్తి సంస్థ మద్దతు ధర కింద క్వింటాల్‌కు ?8110/- చెల్లించనుంది. అయితే రైతులు తమ పంటను అమ్ముకునే ముందు తప్పనిసరిగా వ్యవసాయ శాఖలో పత్తి పంట నమోదు చేయించుకోవాలి. ఆధార్ నంబర్ ఆధారంగా రుజువును సమర్పించిన రైతులకు మాత్రమే సీసీఐ కొనుగోలు హక్కు లభిస్తుంది. జిల్లాలోని రైతుల పత్తి పంటను నాణ్యత ప్రమాణాల ఆధారంగా కొనుగోలు చేయనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. తేమ శాతం ఆధారంగా మద్దతు ధర మారుతుందని వెల్లడించారు. తేమ శాతం 12 మించితే సీసీఐ కొనుగోలు చేయదు. అలాగే పత్తి సహజ రంగు మారకుండా ఉండాలి. నాణ్యమైన పత్తిని మాత్రమే లూజ్ రూపంలో కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని అధికారులు రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ సంవత్సరం ఖమ్మం జిల్లాలో 9 జిన్నింగ్ మిల్లులను సీసీఐ కొనుగోలు కేంద్రాలుగా ప్రతిపాదించింది. రైతులు సమీపంలోని ఈ కేంద్రాల్లోనే తమ పంటను విక్రయించవచ్చు.

| | |
|---|---|
| 8% తేమ | 8110 |
| 9% తేమ | 8029 |
| 10% తేమ | 7948 |
| 11% తేమ | 7867 |
| 12% తేమ | 7786 |

### "కపాస్ కిసాన్" యాప్ ద్వారా స్మార్ట్ సదుపాయం

సీసీఐ ఈ సంవత్సరం నుండి ఆధునికతకు పునాదులు వేసేలా "కపాస్ కిసాన్ మొబైల్ యాప్" ను ప్రవేశపెట్టింది. రైతులు ఈ యాప్ ద్వారా తమ పత్తిని విక్రయించడానికి ముందస్తుగా స్లాట్ బుక్ చేసుకోవాలి. నిర్ణయించిన తేదీ మరియు సమయానికి సీసీఐ కొనుగోలు కేంద్రానికి హాజరై విక్రయం చేయవచ్చు. ఈ యాప్ గూగుల్ ప్లే స్టోర్ , ఆపిల్ ఐ ఓ ఎస్ స్టోర్ లో అందుబాటులో ఉంది. రైతులు తమ మొబైల్ నంబర్ మరియు ఓ టి పి ద్వారా లాగిన్ అవ్వాలి. ఆ తర్వాత సమీపంలోని సీసీఐ కేంద్రాన్ని ఎంచుకొని స్లాట్ బుక్ చేసుకోవచ్చు. ఈ విధానం ద్వారా రైతులకు సమయపాలన సౌలభ్యం, పారదర్శక కొనుగోలు విధానం, తక్షణ చెల్లింపు ప్రక్రియ వేగవంతం అవుతుందని అధికారులు వివరించారు.

### రైతులకు సూచనలు

జిల్లా మార్కెటింగ్ శాఖ ఖమ్మం తరపున రైతులకు సూచనలుగా తెలిపినవి: పత్తి పంటను తప్పనిసరిగా వ్యవసాయ శాఖలో నమోదు చేయించుకోవాలి. నాణ్యమైన, తక్కువ తేమ ఉన్న పత్తిని మాత్రమే కేంద్రాలకు తీసుకురావాలి. కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకొని నిర్ణీత తేదీ, సమయానికి మాత్రమే పత్తిని విక్రయించాలి. పత్తి పంటను లూజ్ రూపంలో మాత్రమే తీసుకురావాలి. తేమశాతం 12% మించితే కొనుగోలు జరగదు. జిల్లా రైతులకు స్పష్టమైన సందేశం. రైతులు ప్రభుత్వం నిర్ణయించిన ప్రమాణాలను పాటించి, నాణ్యమైన పత్తి ద్వారా లాభాలు పొందాలని, సీసీఐ ఇచ్చిన ఆధునిక డిజిటల్ సదుపాయాలను వినియోగించుకోవాలని" సూచించారు

## అవగాహనతోనే మార్పు సాధ్యం



**ఖమ్మం సిటీ, మహా:** ప్రపంచ మానసిక వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఖమ్మం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా న్యాయ సేవా సంస్థ ప్రతినిధి నాగయ్య ప్రధాన అతిథిగా హాజరై మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో మానసిక వికలాంగుల పట్ల కరుణ, అవగాహన అవసరమని చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో, రోడ్లపై తిరుగుతూ కనిపించే మానసిక రోగులను గుర్తించినవారు సమీప పోలీసు స్టేషన్ లేదా ప్రభుత్వ ఆసుపత్రికి తెలియజేయాలని సూచించారు. వారిని మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచి, అవసరమైన వైద్యం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అత్తిడి, ఆందోళన, మాదక ద్రవ్యాల వాడకం వల్ల కొందరు మతిస్థిమితం కోల్పోతున్నారని, ఈ సమస్యపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు న్యాయ విజ్ఞాన సదస్సులు, అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్ర న్యాయ సేవా సంస్థ, హైదరాబాద్ ఆదేశాల మేరకు వివిధ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేందర్, డాక్టర్ సౌభ్య, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## తొలి రోజు నామినేషన్స్ నిల్!



**నేలకొండపల్లి, మహా:** ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల పర్వం ప్రారంభమైంది. ఎంపీడీఓ, యంఈవో, ఐకేపీ కార్యాలయాల వద్ద ఎంపీటీసీ నామినేషన్ల కౌంటర్స్ ను ఏర్పాటు చేశారు. ఎంపీటీసీ స్థానాలకు ఆరు కౌంటర్లు, జడ్పీటీసీ ప్రత్యేక కౌంటర్ ను ఏర్పాటు చేశారు. ప్రతీ కౌంటర్ వద్ద రిటర్నింగ్ అధికారి తో సిబ్బందిని ఏర్పాటు చేశారు. నామినేషన్ల పర్వం ను ఖమ్మం ఆర్డీవో నరసింహారావు పరిశీలించారు. ఏర్పాట్లు కు సంబంధించిన ఏర్పాట్లు పై అధికారులను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ వేసేందుకు వచ్చే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎన్నికల నిబంధనలు తప్పకుండా పాటించాలని ఆదేశించారు. తొలి లిరోజు నామినేషన్ ఒక్కటి కూడ దాఖలు కాలేదు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వి.వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ యం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి సి.హెచ్.శివ, పీఆర్ ఏఈ ప్రసాద్, మండల రెవిన్యూ ఇన్సెపెక్టర్ ఆలస్యం మధుసూధన్రావు, రిసోర్స్ పర్సన్ పెద్ది జగన్నాధం పాల్గొన్నారు.

## వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



**నెలకొండపల్లి, మహా:** ఈనెల 12 వ తేదీన (ఆదివారము) నేలకొండపల్లి సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు అమర జీవి నూతక్కి గంగాధర్ రావు (ఎన్.జి.ఆర్) ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక సిపిఐ(ఎం) కార్యాలయం రావెళ్ల సత్యనారాయణ భవనంలో జరిగే 34వ నెల నెలా ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎన్జీఆర్ ఫౌండేషన్ కన్వీనర్ ఏటుకూరి రామారావు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక రాఘవేంద్ర సత్యనారాయణ భవనంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్, మూర్చ (ఫిట్స్), తలనొప్పి, మూత్రపిండాల వ్యాధులతో పాటు ఇతర అనారోగ్య సమస్యలకు కూడా ఉచితంగా వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. వైద్య శిబిరంలో డాక్టర్ మురకొండ వినోద్ బాబు ఎంబిబిఎస్, ఎండి, డిఎం నెఫ్రాలజీ (మూత్రపిండాల వ్యాధి నిపుణులు), డాక్టర్ ఎలమద్ది వినూష ఎంబిబిఎస్, ఎండి, డిఎం, న్యూరో ఫిజీషియన్, డాక్టర్ గుడిపూడి రాజేష్ ఎంబిబిఎస్, డిఎన్బి (ఇఎన్టి) చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు, డాక్టర్ హస్నద్ బాబా ఎంబిబిఎస్, డాక్టర్ అడపా జయశ్రీ ఎంబిబిఎస్, ఎంఎస్, ఆప్టాలజీ (నేత్ర వైద్య నిపుణుల రోగులకు వైద్య సేవలు అందిస్తారన్నారు. మరింత సమాచారం కొరకు 9490098225, 903089 7480, 9949592544, 9110364581 లను సంప్రదించా లన్నారు.

# ఉమ్మడి ఖమ్మం అభివృద్ధిపై సీఎం సమీక్ష

- సీతారామ ప్రాజెక్టు భూ సేకరణ సమస్యలకు తక్షణ పరిష్కారం
- రహదారి, విద్యుత్ ప్రాజెక్టుల సమన్వయ చర్చ
- నూతన యూనివర్సిటీ- భద్రాచలం కరకట్ట విస్తరణకు స్పష్టమైన ప్రభుత్వం మార్గదర్శకం

**ఖమ్మం, మహా:** ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయడానికి గురువారం సచివాలయంలో కీలక సమావేశం జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమక్షంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లా పరిధిలో సాగుతున్న ప్రధాన ప్రాజెక్టుల పురోగతి, పెండింగ్ పనుల పరిష్కారం, రైతుల సంక్షేమం, భూ సేకరణ సమస్యలు, నూతన హైవేలు, విద్యుత్ మరియు విద్యా నిర్మాణాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశం ఖమ్మం అభివృద్ధికి కొత్త దిశానిర్దేశకంగా నిలిచింది.సీతారామ ప్రాజెక్టు వేగవంతం , భూ సేకరణపై కేంద్ర దృష్టిసమావేశంలో ప్రధానంగా సీతారామ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ భూ సేకరణ సమస్యలు చర్చకు వచ్చాయి. మంత్రి తుమ్మల రైతుల సమస్యలను వివరించి, పెండింగ్ భూబిల్లులను తక్షణమే విడుదల చేయమని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే ఆదేశిస్తూ, పనులను వేగంగా పూర్తి చేయడానికి స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. హైవేలు, రహదారులు, విద్యుత్ ప్రాజెక్టులు , సమన్వయం కీలకం ఖమ్మం-దేవరపల్లి, అమరావతి-నాగపూర్ గ్రీన్ ఫీల్డ్ హైవేలకు భూసేకరణలోని అడ్డంకులు తొలగించమని రెవిన్యూ శాఖకు సీఎం ఆదేశించారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఎలక్ట్రికల్ పోల్స్ షిఫ్టింగ్ వేగవంతం చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. పెండింగ్ ప్రాజెక్టులపై సమన్వయంతో పనులు పూర్తి చేయడానికి అవసరమైతే ప్రత్యేక సమీక్షా సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు.



### నూతన ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ,.. విద్యా నిర్మాణానికి రూ. 1000 కోట్లు

కొత్తగూడెం ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ నూతన భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారైనట్లు మంత్రి తుమ్మల తెలిపారు. మొదటి తరగతులను ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఆహ్వానిస్తూ, ఎన్నికల కోడ్ ముగియగానే తగిన సమయాన్ని చూసి వస్తానని తెలిపారు.

### భద్రాచలం కరకట్ట విస్తరణ -వరద రహిత పట్టణం

భద్రాచలం పట్టణాన్ని గోదావరి వరద నుండి శాశ్వతంగా విముక్తం చేయడానికి కరకట్ట విస్తరణకు అవసరమైన నిధులను మంజూరు చేయమని మంత్రి తుమ్మల కోరారు. సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించి, ప్రజల అంచనాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను కొనసాగించడానికి స్పష్టమైన మార్గదర్శకం ఇచ్చారు.

## కాన్షిరాం వర్ధంతి సందర్భంగా ఘన నివాళి



**ఖమ్మం సిటీ, మహా:** ఖమ్మం పట్టణంలో బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు మాన్య శ్రీ కాన్షిరాం 19వ వర్ధంతిని పురస్కరించుకొని పార్టీ కార్యకర్తలు ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు చెరుకుపల్లి నాగేశ్వరరావు అధ్యక్షత వహించగా, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బండి పృథ్వీరాజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా కాన్షిరాం చిత్రపటానికి పూలమాల వేసి స్మరణ చేశారు. అనంతరం మాట్లాడిన నాయకులు, బాబాసాహెబ్ అంబేద్కర్ సిద్ధాంతాలను ఆచరణలో పెట్టి అట్టడుగు వర్గాలకు రాజకీయ అధికారం సాధించే మార్గం చూపిన మహానేత కాన్షిరాం సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జిలు ఎం.పుల్లయ్య, అయితగాని శ్రీనివాస్ గౌడ్, పల్లెపొంగు విజయ్ కుమార్, కర్రీ కృష్ణ, వేల్పుల రామయ్య, మిర్యాల నాగరాజు, ఎం.నాగేశ్వరరావు, రమేష్ యాదవ్, బుర్ర ఉపేందర్, కారుమంచి నాగరాజ్, దారెల్లి రమేష్, రాజశేఖర్, నల్లగట్ల సతీష్, పూలే కోటయ్య, అర్జున్, శంకర్, బంక వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుడికి అండగా తోట రామారావు



**ఖమ్మం సిటీ, మహా:** ఖమ్మం కూరగాయల మార్కెట్లో పనిచేస్తున్న హమాలి అడపా సైదులు ప్రమాదానికి గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న బి ఆర్ ఎస్ జిల్లా నాయకుడు, వెజిటబుల్ అధినేత తోట రామారావు వెంటనే స్పందించి, తన టి ఆర్ ఆర్ ఆర్థో హాస్పిటల్‌లో ఉచిత చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు.తదనంతరం సైదుల కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సహాయం అందించారు. టి ఆర్ ఆర్ వెజిటబుల్ కమిషన్ మర్చంట్, సి హెచ్ వి కమిషన్ మర్చంట్, తోటి హమాలి కార్మికుల తరపున రూ.15,000 సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో హమాలి నాయకులు కర్రె రమేష్, సత్యనారాయణ, బీరప్ప, నరసింహ రవి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు



**ఖమ్మం,మహా:** జిల్లాలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకులు క్రిష్ణ ఆదిత్య అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో ఎన్నికల పరిశీలకులు, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ లతో కలిసి సంబంధిత నోడల్ అధికారులతో గురువారం ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు.ఈ సందర్భంగా ఎన్నికల పరిశీలకులు క్రిష్ణ ఆదిత్య మాట్లాడుతూ గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ఎక్కడైనా కోర్టు కేసులు నమోదు అయ్యాయా, రీపోల్ జరిగిందా వంటి అంశాలను పరిశీలించి రిపోర్టు అందించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సిబ్బందికి అవసరమైన శిక్షణ సంపూర్ణంగా అందించాలని అన్నారు. ప్రతి అధికారి ఎన్నికల నిబంధనల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఎన్నికల విధులు కేటాయించిన సిబ్బంది తప్పనిసరిగా శిక్షణ కార్యక్రమాలకు హాజరయ్యేలా చూడాలని అన్నారు.

## మహిళలు వృత్తి విద్య కోర్సులను సద్వినియోగం చేసుకోండి

**కొత్తగూడెం టౌన్, మహా:** మహిళలు వృత్తి విద్య కోర్సులను సద్వినియోగం చేసుకొని ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని సింగరేణి జీఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ అన్నారు. సింగరేణి కార్పొరేట్ ఏరియాలోని సింగరేణి సేవా సమితి అధ్వర్యంలో గురువారం బాబుక్యాంప్, ఎన్.కే.నగర్ మహిళలకు ఉచిత మగ్గం వర్క్, టైలరింగ్ శిక్షణా తరగతులను, కొత్తగూడెం పరిసర ప్రాంత మహిళలకు ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ క్లాసులను జిఎం(పర్సనల్) జివి.కిరణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సేవా సమితి ముఖ్య ఉద్దేశం ఉద్యోగ కుటుంబ మహిళలు ప్రాజెక్టు ప్రభావిత పరిసర ప్రాంత మహిళలు ఆర్థికంగా ఎదిగి ఉపాధి పొందాలని పేర్కొన్నారు. సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో వృత్తి విద్యా కోర్సులను నిర్వహిస్తున్నామని దీనిని సక్రమంగా ఉపయోగించుకొని క్రమం తప్పకుండా హాజరై కోర్సు పూర్తి చేసి మంచి శిక్షణ పొంది వృద్ధిలోకి రావాలని కోరారు. కార్యక్రమంలో డిజిఎం(పర్సనల్)కేసా నారాయణరావు, వెల్ఫేర్ పిఏ కే.వరప్రసాద రావు, సేవా కొ ఆర్డినేటర్ ఇజాజ్ షరీఫ్, సేవాసెక్రెటరీ మాధవీ స్వర్ణ లత, సేవా కో-ఆర్డినేటర్లు కే.సుజాత, పుష్ప, సంధ్య, పద్మావతి, శిక్షకులు ఇతర సేవా సభ్యులు పాల్గొన్నారు.



## పెద్దమ్మతల్లి దేవాలయంలో అన్నప్రసాదం

**కొత్తగూడెం టౌన్, మహా:** కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని రైటర్ బస్తీ ఏరియాలో ఉన్న శ్రీ శ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయం ఆవరణలో గురువారం అన్నప్రసాద కార్యక్రమం జరిగింది. విజయదశమి ఉత్సవాలు విజయవంతంగా ముగిసిన సందర్భంగా ఈ అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించినట్లుగా కమిటీ సభ్యులు పేర్కొన్నారు.



# రైతులకు ఊరట

మొక్కజొన్న ను కొనుగోలు చేయనున్న ప్రభుత్వం
ప్రభుత్వ కేంద్రాల ద్వారా కొనుగోలు
రాష్ట్రం రూ.2400 కోట్లతో రైతుల మద్దతు ధర గ్యారంటీ.
మద్దతు ధరతోనే రైతుల ఆర్థిక భద్రతకు మంత్రి తుమ్మల హామీ



**ఖమ్మం, మహా:** తెలంగాణ రాష్ట్రం రైతుల కోసం మరోసారి పెద్ద ఊరటను తెచ్చింది. కేంద్రం మద్దతు ధర ప్రకటించినప్పటికీ కొనుగోళ్లు ఆలస్యమవుతున్న నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వమే మొక్కజొన్న పంటను కొనుగోలు చేయడానికి ముందుకు రావడం గమనార్హం. రైతులు తక్కువ మార్కెట్ ధరల కారణంగా ఆర్థిక నష్టాల్లో పడకుండా ఉండేందుకు ప్రభుత్వం రూ.2400 కోట్ల మద్దతు ధరతో పంట కొనుగోలు చేసే హామీ ఇచ్చింది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా రైతులకు సమీప ప్రభుత్వ కేంద్రాల ద్వారా పంటలను అమ్మి మద్దతు ధర పొందమని సూచించారు. గత సంవత్సరం అదే విధంగా ప్రభుత్వం దాదాపు రూ.535 కోట్లు ఖర్చు పెట్టి రైతులను సేఫ్ చేశిందని, ఈ సీజన్‌లో కూడా రాష్ట్రం రైతుల ఆర్థిక భద్రతకు అదే విధంగా ముందడుగు వేస్తుందన్నారు. వారాంతపు సమావేశంలో, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో చర్చించాక, రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్న పంటను యం ఎస్ పీ ప్రకారం కొనుగోలు చేయడానికి సిద్ధమైందని ప్రకటించారు. ఈ నిర్ణయం, కేంద్రం మద్దతు ధరను ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు కొనుగోళ్లు జరగలేదన్న పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని తీసుకోబడింది.

## గత సంవత్సరం ఉదాహరణతో రైతులకు హామీ

మంత్రుల వివరాల ప్రకారం, గత సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ.535 కోట్లు ఖర్చు పెట్టి, కేంద్రం యం ఎస్ పీ ప్రకటనకు పరిమితం కాకుండా రైతుల పంటను కొనుగోలు చేసింది. ఆ సీజన్‌లో రాష్ట్రంలో మొత్తం 6,24,544 ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరిగింది. ఎకరాకు సగటున 18.50 క్వింటల్ దిగుబడి రాబడడంతో, మొత్తం ఉత్పత్తి 11.56 లక్షల మెట్రిక్ టన్నులు అయ్యింది. ఈ సీజన్‌లో 8.66 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు అవసరం ఉందని అంచనా. సెప్టెంబర్ 3 వ వారంలో మార్కెట్‌లో భారీగా పంట వచ్చినందున ధరలు క్షీణించాయి. ప్రస్తుత ధర 1,959/క్వింటల్ ఉండటంతో 2,400/క్వింటల్ తో పోలిస్తే 441 తక్కువగా ఉంది.

## 2400 కోట్ల భారం వహించడానికి సిద్ధం

రాష్ట్రం రైతుల ప్రయోజనార్థం ఈ మొత్తాన్ని ఖర్చు పెట్టి మద్దతు ధర చెల్లించడానికి సిద్ధమని మంత్రి తుమ్మల తెలిపారు. రైతులు సమీప కేంద్రాలకు తమ పంటను తీసుకువచ్చి మద్దతు ధర పొందవలసిందిగా, ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు అమ్మకాలు చేయకుండా చూడమని సూచించారు. మంత్రులు, కేంద్రం పి ఎస్ ఎస్ స్కీమ్ కింద పెసర, మినుము, సోయాచిక్కుడు, కంది, వేరుశనగ వంటి పంటలపై 25% సీలింగ్ విధించినందున, రైతులు పండించిన మొత్తం పంటను కేంద్రం పూర్తిగా కొనుగోలు చేయడానికి వీలవ్వడం లేదు అని కేంద్రానికి సూచించామని చెప్పారు.మంత్రులు యం ఎస్ పీ ప్రకటనలకంటే మించి, ధరలు పడిపోయినప్పుడు కూడా ప్రభుత్వ కేంద్రాల ద్వారా పంటలను కొనుగోలు చేస్తే రైతులు ఆర్థిక నష్టానికి గురవ్వదని, రైతుల ఆర్థికాభివృద్ధికి రాష్ట్రం కృషి చేస్తుందని స్పష్టం చేశారు.

# బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి బయటపడి



**ఖమ్మం సిటీ, మహా:** బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ అసలు ఉద్దేశం బయటపడి ఉందని ఖమ్మం నగర బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు పగడాల నాగరాజు అన్నారు. హైకోర్టు తాజాగా ఇచ్చిన తీర్పుపై స్పందిస్తూ, "రెండేళ్లుగా బీసీలను మోసం చేస్తూ, చట్టపరమైన ప్రక్రియను పూర్తి చేయకుండా కాంగ్రెస్ పార్టీ నాటకాలు ఆడింది" అని ఆయన తెలిపారు. అదే విధంగా, నిన్న కోర్టులో విచారణ వాయిదా పెట్టడమో, హైకోర్టు నుండి స్టే వచ్చిందో వంటి అంశాల ద్వారా రాజకీయ ప్రయోజనాలను మాత్రమే దృష్టిలో పెట్టిందని ఆయన మండిపడ్డారు. "కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పేరుతో బీసీ సామాజిక వర్గాలను మోసం చేసి, అధికారంలోకి వచ్చాక కూడా నిజమైన న్యాయం చేయడంలో విఫలమైంది" అని పగడాల నాగరాజు అన్నారు. పగడాల నాగరాజు చెప్పినట్లు,పార్టీ ఎల్లప్పుడూ బీసీల హక్కులను రక్షించడంలో అగ్రగామిగా నిలుస్తుందని, ఈ అంశంలో నిరంతర పోరాటం చేయమని స్పష్టం చేశారు.

# బిజెపి ఓటు మోసంపై కాంగ్రెస్ సమావేశం



**ఇల్లందు,మహా:** అఖిల భారత కాంగ్రెస్ కమిటి, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి పిలుపులో భాగంగా ఇల్లందులో ఓటు మోసంపై ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ సమావేశాన్ని పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు దొడ్డా డానియల్ అధ్యక్షతన ప్రభుత్వ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఇల్లందు నియోజకవర్గ శాసన సభ్యుడు కోరం కనకయ్య హాజరయ్యారు. సభలో మాట్లాడుతూ, ఎమ్మెల్యే కోరం కనకయ్య కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పార్టీ మూడు దఫాలుగా ప్రజలను మోసం చేస్తూ పరిపాలన కొనసాగిస్తోందని అన్నారు. సమావేశంలో ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు , ఇల్లందు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పులి సైదులు, ఇల్లందు మాజీ మున్సిపాలిటీ చైర్మన్ ఎదలపల్లి అనసూయ, ఇల్లందు సొసైటీ చైర్మన్ మెట్ల కృష్ణ నాయకులు పూనెం సురేందర్, మాడుగుల సాంబమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టిఐ చట్టం ప్రభావంతంగా అమలు కావాలి




**కొత్తగూడెం టౌన్, మహా:** పారదర్శక పరిపాలన కోసం ఆర్‌టీఐ చట్టం ప్రభావవంతంగా అమలు కావాలని జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ సూచించారు. తెలంగాణ సమాచార హక్కు చట్టం(ఆర్‌టీఐ) 20వ వార్షికోత్సవ వేడుకలు గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ముఖ్యఅతిథిగా హాజరై ఆర్‌టీఐ 2025 విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఐడీఓసీ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ వేడుకలను ప్రత్యక్ష ప్రసారం ద్వారా జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ జిల్లా అధికారులతో కలిసి వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఐ డి ఓ సి కార్యాలయం నుంచి సిపిఓ సంజీవరావు, జిల్లా వైద్య శాఖ అధికారి జయలక్ష్మి, డి సి ఓ రుక్మిణి, ఏడి ఫిషరీస్ ఇంతియాజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై మున్సిపల్ చర్య



**ఖమ్మం సిటీ, మహా:** ఖమ్మం నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. కస్బా బజార్, కమాన్ బజార్, అజీజ్ గల్లీ ప్రాంతాల్లో ఈ తనిఖీలు నిర్వహించి, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడిన దుకాణాలపై రూ.81,500 జరిమానాలు విధించగా, సుమారు 70 కిలోల ప్లాస్టిక్ స్వాధీనం చేసుకున్నారు. ఈ చర్యలో న్యూ బాబా పాలీ బ్యాగ్స్, బాబా పాలీ బ్యాగ్స్, న్యూ బాలాజీ ప్లాస్టిక్స్, రమేష్ నవెల్టీ, భవానీ ప్లాస్టిక్స్, అంబికా ప్లాస్టిక్స్ షాప్, భాను పాలీ బ్యాగ్స్ షాపులు జరిమానా చెల్లించాల్సి వచ్చింది.మున్సిపల్ కమిషనర్ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా మానుకోవాలని, పర్యావరణ హితమైన ప్రత్యామ్నాయాలను వాడాలని ప్రజలకు ఆహ్వానించారు.

# బీసీ రిజర్వేషన్స్ జీవోను కొట్టివేయడం విచారకరం




**ఖమ్మం, మహా:** బీసీ రిజర్వేషన్స్ పెంపుదల జీవోను హైకోర్టు కొట్టివేయడం తీవ్ర విచారకరం, దురదృష్టకరమని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర వ్యాఖ్యానించారు. చట్టసభలతో పాటుగా విద్యా,ఉద్యోగ రంగాలలో బీసీలకు 42% రిజర్వేషన్స్ అమలు జరగాలంటే పార్లమెంటులో చట్టం చేసి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ నందు పొందుపర్చిన తర్వాతే సాధ్యపడుతుందని బీఆర్ఎస్ మొదటి నుంచి కూడా చెబుతున్నదన్నారు.అయినప్పటికీ రేవంత్ రెడ్డి సర్కార్ అసెంబ్లీలో బిల్లులు ప్రవేశపెట్టిన సందర్భాలలో మద్దతివ్వడం జరిగిందన్నారు.ఎంపీ రవిచంద్ర మాజీ మంత్రులు గంగుల కమలాకర్,వీ.శ్రీనివాస్ గౌడ్,ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్ తదితర ప్రముఖులతో కలిసి గురువారం సాయంత్రం హైదరాబాద్ తెలంగాణ భవన్ లో విలేకరులతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన "ఆపరేషన్ సక్సెస్,పేషంట్ డెడ్" అనే చందంగా కాంగ్రెస్ వ్యవహారం ఉందన్నారు.అసెంబ్లీ ఎన్నికలలో ఎలాగైనా బీసీల ఓట్లు కొల్లగొట్టి అధికారంలోకి రావాలనే కుట్ర,కాంక్షతోనే కాంగ్రెస్ నాయకులు కామారెడ్డి డిక్లరేషన్ ప్రకటించారని ఎంపీ రవిచంద్ర మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ప్రచారం కోసమే బీసీ అస్త్రాన్ని ప్రయోగించి ఉపయోగించుకున్నదని చెప్పారు.

మహా పత్రిక
ANN తెలుగు

## తిర్లాపురంలో సింగరేణి వైద్య శిబిరం



**మణుగూరు, మహా:** సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా లోనే తిర్లపురం గ్రామంలో సింగరేణి సేవా సమితి వైద్య ఆరోగ్య శాఖల ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో మొత్తం 134 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. దీంతోపాటు షుగర్ బిపి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి వైద్యురాలు సౌజన్య మాట్లాడుతూ అంటురోగాలు, సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది అనంతలక్ష్మి, సేవా కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, రాము, బాలు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ లకు మళ్ళీ అన్యాయమే: ఆర్జేసి కృష్ణ.



**ఖమ్మం సిటీ, మహా:** బీసీలకు 42% రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించటం తో బీసీ కులస్తులకు మళ్ళీ అన్యాయమే జరిగినట్లయ్యిం దని దీనికి రాష్ట్ర ప్రభుత్వ విధానాలే కారణమని బీసీ సంక్షేమ సంఘం సీనియర్ నాయకులు గుండాల కృష్ణ పేర్కొన్నారు.గురువారం ఖమ్మం ఆర్జే సి కళాశాలలో ఏర్పాటు చేసిన బీసీ కుల సంఘాల ముఖ్య నాయకుల సమావేశం లో ఆయన మాట్లాడారు. బీసీలకు 42% శాతం రిజర్వేషన్ ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని ఆరోపించారు.ఉభయ సభల్లో ను బిల్లు ఆమోదం పొందాక ఇలా జరగడం అగ్ర వర్ణాల ఆధిపత్యాన్ని చూపుతుందన్నారు.చీకట్లో గొంగడి కప్పుకొని చాటుగా రిజర్వేషన్ ఇవ్వొచ్చా లేదా అని ప్రభుత్వం చూస్తుందాని మండి పడ్డారు.జనాభా దామాషా ప్రకారం హక్కుగా రావాల్సిన రిజర్వేషన్లను అడ్డుకోవాలని హై కోర్టులో,సుప్రీంకోర్టులో కేసు వేశారని ఆరోపించారు. ఏది ఏమైనా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. లేనియెడల ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.ఈ సమావేశంలో బీసీ సంఘాల నాయకులు కురాకుల నాగభూషణం,బొమ్మా రాజేశ్వర రావు, కత్తి నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

## కోర్టు స్టేతో బీసీలకు అన్యాయం



**ముదిగొండ అక్టోబర్ 09 మహా:** కోర్టు స్టేతో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అన్యాయం జరిగిందని బీసీ సంఘం రాష్ట్ర నాయకులు,ముదిగొండ సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి ఆవేదన వ్యక్తం చేశారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు జీవో ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వంపై హైకోర్టులో పిటిషన్ పై స్టే విధించటాన్ని నిరసిస్తూ బీసీ సంఘం ఆధ్వర్యంలో మండలపరిధిలో వనంవారికిష్టాపురంలో బీసీ సంఘం రాష్ట్ర నాయకులు తుపాకుల యలకొండ స్వామి ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడారు.ఎన్నో ఏండ్లగా సామాజికంగా దోపిడీకి గురవుతున్న బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం 42% రిజర్వేషన్లు కల్పించిందన్నారు.రాజకీయ, సామాజిక రంగాల్లో వెనుకబడిన బీసీలు ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు.42% బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రిజర్వేషన్ల హైకోర్టు కొట్టేయటం అన్యాయమన్నారు.బీసీలకు నోటికాడికి వచ్చిన రిజర్వేషన్లు ఫలాలను హైకోర్టు దూరం చేయటం బాధాకరమన్నారు.

## ఏడుగురు అభ్యర్థుల నామినేషన్

**ఖమ్మం, మహా:** ఖమ్మం జిల్లాలో జెపిటీసీలు, ఎంపిటీసీలు ఎన్నికల నామినేషన్లు ప్రారంభమైన మొదటి రోజున ఏడుగురు అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. గురువారం పది జెపిటీసీ స్థానాలకు ఇద్దరు అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఆప్ పార్టీ రెండు అభ్యర్థులను నమోదు చేసింది. స్వతంత్ర అభ్యర్థుల సంఖ్య కూడా ఇద్దరు. 149 ఎంపిటీసీ స్థానాలకు నామినేషన్లు రావాల్సి ఉండగా మొదటి రోజున ఐదుగురు అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఆప్ ఐదుగురు, కాంగ్రెస్ ఒకరు, టీడీపీ నలుగురు, స్వతంత్ర అభ్యర్థులు ఐదుగురు నమోదు చేసుకున్నారు. హైకోర్టు స్టే ఇవ్వడం తోజరిగే ప్రక్రియ ఆగిపోయినట్లు అయింది.





# రాష్ట్రస్థాయి ఫుట్బాల్ పోటీలకు

# యడవల్లి హైస్కూల్ విద్యార్థిని ఎంపిక

**ముదిగొండ అక్టోబర్ 9 మహా:** సంగారెడ్డి జిల్లా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ స్టేడియంలో ఈనెల10,11,12, తేదీలలో అండర్ 19 రాష్ట్రస్థాయి ఫుట్బాల్ ఛాంపియన్షిప్ కి మండల పరిధిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యడవల్లిలో 10వతరగతి చదువుతున్న బెల్లంకొండ కావ్య ఉమ్మడి ఖమ్మం జిల్లా టీం నుండి ఎంపికైందని పాఠశాల ప్రధానోపాధ్యాయని నాగమణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.కావ్య గత మూడు సంవత్సరాలలో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్షిప్ కి,200 మీటర్ల పరుగు పందెంలో పాల్గొని ప్రతిభ చూపిందని ఆమె పేర్కొన్నారు. జూనియర్ ఫుట్బాల్ రాష్ట్రస్థాయి ఛాంపియన్షిప్లో కాంస్య పథకం కావ్య సాధించిందని ఆమె చెప్పారు.అండర్ 19 రాష్ట్ర స్థాయి ఫుట్బాల్ ఛాంపియన్షిప్ ఎంపిక కావడం పట్ల మండల విద్యాశాఖ అధికారి దుగ్గిరాల రమణయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయని నాగమణి,అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షులు కందిమల్ల లక్ష్మి, పిడిలు బియ్యని కృష్ణయ్య,శ్రీనివాసరావు పాఠశాల ఉపాధ్యాయులు,ఉపాధ్యాయునిలు,గ్రామ పెద్దలు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## మధిర మార్కెట్ కమిటీ కొత్త డ్రయింగ్ యంత్రం

**మధిర, మహా:** రాబోయే ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని, మధిర మార్కెట్ కమిటీ రైతులకు సౌకర్యం కలిగించే విధంగా కొత్త డ్రయింగ్ మిషన్‌ను కొనుగోలు చేసింది. ఈ రోజున మధ్యాహ్నం మధిర మార్కెట్ యార్డ్‌లో ఇండస్ట్రీ యజమానితో కలిసి డ్రయింగ్ యంత్రాన్ని పరిశీలించిన చైర్మన్ బండారు నరసింహారావు, రైతులు తడిసి, రోడ్లపై విస్తరించి ఉంచే పద్దతిని ఎండపెట్టు పద్ధతికి భద్రతైన ప్రత్యామ్నాయం అందిస్తారని తెలిపారు. చైర్మన్ బండారు నరసింహారావు మాట్లాడుతూ, "ఇప్పటివరకు గడచిన సీజన్లలో రైతులు హార్వెస్ట్ చేసిన ధాన్యాన్ని రోడ్లపై లేదా కళ్ళాల్లో ఉంచి ఎండపెట్టే పద్ధతిని అనుసరిస్తున్నారు. దీనివల్ల రోడ్లపై ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అలాగే వర్షం పడ్డప్పటికి పచ్చి ధాన్యం తడిసి నష్టం జరుగుతోంది. కొత్త డ్రయింగ్ యంత్రం ద్వారా పచ్చి ధాన్యాన్ని కేవలం మూడు గంటలలో ఆరుచేయడం, కాటా వేసి అమ్మడం సులభం అవుతుంది.



## ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ మృతి



**బూర్గంపహాడ్ మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బుర్గంపాడ్ మండలం వేపలగడ్డ గ్రామానికి చెందిన కణితి సతీష్(45) గత మూడు రోజులు జ్వరంతో బాధపడుతూ భద్రాచలం హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు ప్లేట్లెట్స్ తగ్గి పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ లో ప్రైవేట్ హాస్పిటల్ కి తరలించగా చికిత్స పొందుతూ ఉదయం సుమారుగా 10 గంటలకు మరణించారు. సతీష్ చర్ల మండలంలో ఉపాధి హామీలో టెక్నికల్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్నారు అతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## బీసీలకు అన్యాయం చేసిన వారిని వదిలిపెట్టం



**బూర్గంపహాడ్ మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడంపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు మహంకాళి రామారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని, బీసీల నోటికాడి ముద్దను లాగేశారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ తొందరపాటు వల్లే తమకు అన్యాయం జరిగిందని విమర్శించారు. బీసీల సత్తా ఏంటో చూపిస్తామన్నారు. జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య పిలుపు మేరకు ప్రభుత్వ స్పందన చూసి రేపటి నుంచి బంద్ కు పిలుపునిస్తామని స్పష్టం చేశారు.కోర్టులను అడ్డంపెట్టుకుని బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవాలని చూస్తే తగిన గుణపాఠంతప్పదు అని హెచ్చరించారు.

# ఖమ్మం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల పరిశీలన

## రూ.25.41 కోట్లతో మోడల్ స్టేషన్‌గా రూపుదిద్దుకుంటున్న రైల్వే స్టేషన్

- ప్రయాణికుల సౌకర్యాలే బీజేపీ ప్రభుత్వ ధ్యేయం
- బీజేపీ రాష్ట్ర కోశాధికారి వాసుదేవరావు, బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు





**ఖమ్మం, మహా:** ఖమ్మం రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. గురువారం ఈ పనుల పురోగతిని బీజేపీ రాష్ట్ర కోశాధికారి డి. వాసుదేవరావు, భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు ప్రత్యక్షంగా పరిశీలించారు. స్టేషన్ ప్రాంగణంలో జరుగుతున్న నిర్మాణ పనులను ఆయన రైల్వే అధికారులతో కలిసి సమీక్షించి, అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా రైల్వే వ్యవస్థను ఆధునిక సదుపాయాలతో తీర్చిదిద్దుతున్నాం. ఖమ్మం రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం రూ. 25.41 కోట్ల నిధులు కేటాయించబడి, పనులు దశలవారీగా వేగంగా సాగుతున్నాయి. ఈ స్టేషన్ ద్వారా రోజూ 83 రైళ్లు ప్రయాణికులకు సేవలందిస్తున్నాయి. సూపర్‌ఫాస్ట్ రైళ్లు, ఎక్స్‌ప్రెస్ రైళ్లు, ప్రధాన నగరాలకు వెళ్లే పలు రైళ్లు ఇక్కడ ఆగుతుండటంతో ఖమ్మం రైల్వే స్టేషన్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది" అని ఆయన తెలిపారు. స్టేషన్ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా ప్రధాన భవనం ముఖద్వారం పునర్నిర్మాణం, ఆకర్షణీయమైన ప్రధాన ప్రవేశ ద్వారం నిర్మాణం, 12 మీటర్ల వెడల్పు గల ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం, రెండు ఎస్కలేటర్లు, రెండు లిఫ్టులు ఏర్పాటు, ఆధునిక వేటింగ్ హాల్స్, శుభ్రమైన వాష్‌రూములు, డిజిటల్ డిస్‌ప్లే బోర్డులు, విస్తృత పార్కింగ్ సదుపాయాలు వంటి పనులు జరుగుతున్నాయి. అదనంగా ప్రయాణికుల భద్రత కోసం సీసీటీవీ కెమెరాలు, సెక్యూరిటీ కంట్రోల్ రూమ్ వంటి ఆధునిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే ప్రయాణికుల రక్షణ కోసం సిఆర్పీఎఫ్ పోలీస్ స్టేషన్ భవనం నిర్మాణం కూడా కొనసాగుతోంది. బీజేపీ ప్రభుత్వం ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా సేవలు అందించాలనే సంకల్పంతో ముందుకు సాగుతోంది. అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత ఖమ్మం రైల్వే స్టేషన్ తెలంగాణ రాష్ట్రంలో ఒక మోడల్ స్టేషన్‌గా నిలుస్తుంది. ఇది ఖమ్మం ప్రజలకు గర్వకారణంగా మారుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ మాజీ అభ్యర్థి నున్న రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్తా వెంకటేశ్వర్లు, జిల్లా సెక్రటరీ తొండెపు సైదేశ్వరరావు, జిల్లా నాయకులు వేల్పుల సుధాకర్, మంద సరస్వతి, మార్తి ప్రసాద్, ఈదుల భద్రం, గడిల నరేష్, ఆర్.వి.ఎస్. యాదవ్, దుద్దుకూరి కార్తీక్, పసుమర్తి సతీష్, డి.కొండ శ్యామ్, శాసనాల సాయిరాం, మండల నాయకులు పాలెపు రాము, కడుదుల ప్రభాకర్, నాగవల్లి రామచంద్రం, గుత్తా వంశీ, భూక్య బాలాజీ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## టెన్త్ పరీక్షల షెడ్యూల్ విడుదల

**ఖమ్మం, మహా:** తెలంగాణ రాష్ట్ర విద్యార్థులకు ఈ ఏడాది పదో తరగతి పరీక్షల షెడ్యూల్ ను అధికారికంగా విడుదల చేసింది. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు మార్చి 16న ప్రారంభమవుతాయి. ఫస్ట్ లాంగ్వేజ్ పరీక్ష (తెలుగు, హిందీ, ఉర్దూ, కన్నడ, తమిళ్, ఒడియా, కంపోజిట్ కోర్సు) నిర్వహించబడుతుంది. ఆ తర్వాత మార్చి 18న సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష (హిందీ, తెలుగు, స్పెషల్ ఇంగ్లీష్) ఉంటుంది. మార్చి 21న ఇంగ్లీష్ పరీక్ష నిర్వహించబడనుంది. అంతేకాకుండా, మార్చి 23న మ్యాథ్స్, మార్చి 25న ఫిజికల్ సైన్స్, మార్చి 28న బయాలజీ పరీక్షలు, చివరగా మార్చి 30న సోషల్ స్టడీస్ పరీక్షలు జరగనున్నాయి. ఇలా మొత్తం పదో తరగతి పరీక్షలు మార్చి 16 నుంచి మార్చి 30 వరకు కొనసాగుతాయి.

## సీసీఐ కేంద్రాలతోనే రైతుకు మద్దతు ధర



**కారేపల్లి, మహా :** టటతులు తమ పత్తి ని సీసీఐ కేంద్రాలలోనే అమ్మకాలు చేసుకోవాలని ఇల్లందు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఈ నరేష్‌కుమార్ అన్నారు. గురువారం కారేపల్లి మండలంలో సీసీఐ పత్తి కొనుగోళ్లపై రైతులకు అవగాహణ కల్పించారు. కారేపల్లి క్రాస్‌రోడ్, కారేపల్లిలో జరిగిన సదస్సులో ఏఎంసీ కార్యదర్శి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం పత్తి క్వింటాకు రూ. 8110 ధర ప్రకటించిందన్నారు. మద్దతు ధర పొందాలంటే రైతులు తప్పని సరిగా సీసీఐ కేంద్రాలలో పత్తి విక్రయించాలన్నారు. పత్తి కొనుగోళ్లలో ఆక్రమాలను నివారించటానికి సీసీఐ మొబైల్ యాబ్ తీసుకవచ్చిందని తెలిపారు. పత్తి అమ్ముకునే రాతులు ఈ యాఫ్‌లో స్లాట్ బుక్ చేసుకోవల్సి ఉంటుందన్నారు. దీని ద్వారా సీసీఐ కేంద్రాల వద్ద రైతుల రద్దీ ని నియంత్రించ వచ్చన్నారు. నాణ్యమైన పత్తిని సీసీఐ కేంద్రాలను తీసుకవచ్చి మద్దతు ధర పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఎన్.శ్రీనివాసరావు, సిబ్బంది రంజిత్, మున్నేరు, మధు, రవి, రైతులు పాల్గొన్నారు.

## యువతలో ఉన్మాదాన్ని ఎక్కిస్తున్న బీజేపీ



**కారేపల్లి, మహా:** దేశంలోని యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించాల్సిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దాని నుండి వ్యతిరేకత లేకుండా చేసుకునే పనిలో యువతలో ఉన్మాద బావాజాలాన్ని ఎక్కించే ప్రయత్నం చేస్తుందని డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆదెర్ల వినయ్‌కుమార్ విమర్శించారు. గురువారం కారేపల్లిలో చేగువేరా వర్ధంతిని నిర్వహించారు. చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈసందర్బంగా వినయ్‌కుమార్ మాట్లాడుతూ చేగువేరా జీవితాంతం సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడారన్నారు. సామ్రాజ్యవాదంతో ముప్పుపై యువతను చైతన్యం చేసి యూత్ ఐకాన్‌గా మారారన్నారు. ప్రజాస్వామ్య భారత దేశంలో రాజ్యాంగాన్ని రక్షించే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్ గవాయిపై సనాతన ధర్మం పేరుతో మతోన్మాద మూకలు దాడి చేయడం దుర్మార్గమన్నారు. ఈ ఘటన బిజెపి ఉన్మాద భావజాల ఫలితమేనన్నారు. దీనిని ప్రజాస్వామ్య వాదులు ఖండిరచాలన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు నవొ గడ్డం దిలీప్ కుమార్, యర్నాగి సంపత్ ,సలీం, చిలుముల కమలాకర్, అదెర్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం



**మణుగూరు, మహా:** మాదక ద్రవ్యాలకు బానిసై యువత తమ భవిష్యత్తును చీకట్లోకి నెట్టకూడదని మణుగూరు ఎస్సై నగేష్ సూచించారు. యువతలో పెరుగుతున్న మాదక ద్రవ్యాలైన గంజాయి, మద్యం తదితరాల వినియోగాన్ని అరికట్టేందుకు గురువారం మండల పరిధిలోని రామానుజవరంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలు తాత్కాలిక ఆనందాన్ని ఇస్తున్నట్టనిపించినా, జీవితాన్ని నాశనం చేసే విషపదార్థాలుగా మారతాయని. ఆరోగ్యం, కుటుంబం, భవిష్యత్తు అన్నీ కోల్పోయే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. యువత తమ శక్తిని సమాజ అభివృద్ధికి వినియోగించుకోవాలని, ఇలాంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయంపై సమాచారం తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## కబడ్డీలో పినపాక విద్యార్థుల సత్తా!



**మణుగూరు/పినపాక, మహా :** క్రీడల్లో ప్రతిభ చూపిన పినపాక జోన్ విద్యార్థులు జిల్లా స్థాయిలో అండర్-14 బాయ్స్ కబడ్డీ పోటీల్లో విజేతలుగా నిలిచారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో పినపాక జోన్‌కు చెందిన విద్యార్థులు అద్భుతమైన ఆటతీరుతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ప్రత్యర్థి జట్టును ఓడించి విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రదాన కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు. క్రీడలు విద్యార్థుల మానసిక, శారీరక వికాసానికి దోహదపడతాయని ఆమె అభినందించారు. విజేత విద్యార్థులను వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను అభినందించారు.

## 46వ డివిజన్లో విజయవంతంగా సంతకాల సేకరణ



**ఖమ్మం సిటీ, మహా:** ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఆదేశానుసారం, టిపిసిసి సూచన మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం పట్టణంలో 46 వ డివిజన్ లో ఆ డివిజన్ కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహ్మద్ జావేద్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాజ్యాంగ పరిరక్షనే ధ్యేయంగా రాహుల్ గాంధీ అహర్నిశలు శ్రమిస్తున్నారని అందులో భాగంగా ఓట్ చోర్ గద్దె చోడ్ ఉద్యమానికి పిలుపు ఇవ్వడం జరిగింది అని అన్నారు. బీహార్ ఎన్నికల జాబితాలో జరిగిన అవకతవకలను ప్రజలకు వివరిస్తూ డివిజన్ నుండి 100 సంతకాల కు తగ్గకుండా సేకరించడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ పేరు పేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే మిగిలి ఉన్న అన్ని డివిజన్ లలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# ఖమ్మంలో ఘోర హత్య

- యువకుడి ముక్కలుగా విసిరిన దుండగులు
- యూట్యూబ్ ఆధారంగా ఘాతుకం
- హత్య కేసు ఫొరెన్‌ఫిక్ రహస్యాలు వెలుగు
- నిందితులు అరెస్ట్
- మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన ఏసిపి





**ఖమ్మం క్రైమ్, మహా:** ఖమ్మం జిల్లా రూరల్ ప్రాంతంలో ఘోరమైన హత్య ఘటన చోటుచేసుకుంది. ఏసీపీ తిరుపతి రెడ్డి గురువారం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. పరిమి అశోక్ అనే యువకుడు, అతనితో కలిసి ఉన్న నిందితులు నగ్మా, కృష్ణయ్య కలిసి, వేర్వేరు వ్యక్తులను ప్లాన్ చేసినట్లుగా హత్య చేసి, మృతదేహాన్ని ముక్కలుగా చేసి విసిరి వేశారు. మృతుడు వెంకటేశ్వర్లు కామేపల్లి మండ లం కెప్టెన్ బంజారా గ్రామానికి చెందినవాడు. అతను ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నప్పటికీ, పరిచ యాల ద్వారా అశోక్ తో స్నేహం ఏర్పడింది. అశోక్, నాగ్మా, కృష్ణయ్యలు వెంకటేశ్వర్లు వద్ద డబ్బులు, బంగారం ఉందని భావించి, దాన్ని దోచే దుర్మార్గ పథకం రచించారు. ఆ కోసం యూట్యూబ్‌లోని హత్యల సంబంధిత వీడియోలను పరిశీలించి, దానిని అనుసరించ ాలని నిర్ణయించారు. క్రమంలో, గత నెల 15న రాత్రి అశోక్ ఇంటికి వెంకటేశ్వర్లు వచ్చి పడినప్పుడు, తెల్లవారుజామున 5:00 గంటల ప్రాంతంలో నిందితులు అతన్ని గట్టి కత్తితో గొంతు మరియు మెడపై కత్తిపడలతో చంపి, శరీరాన్ని ముక్కలుగా చేసి, కవర్లలో పెట్టి మోటార్ సైకిల్ ద్వారా కరుణగిరి ప్రాంతంలోని చెత్త పొలంలో విసరారు. ఆ తర్వాత రూమ్ లో ఉన్న రక్తపు మచ్చలను పూర్తిగా తొలగించారు. ఈ కేసు విచారణలో రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి, సింగరేణి సీఐ, తదితర పోలీస్ అధికారులు సహకరించారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సీపీ కేసు విచారణలో పోలీస్ జట్టు పని తీరును సగౌరవం తెలియజేసారు. విచారణలో పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయని, ఇంకా మరిన్ని వివరాలు మేఘాలపై రాబోయే రోజుల్లో వెల్లడిస్తామని ఏసీపీ తెలిపారు. ఈ ఘోర ఘటన ఖమ్మం జిల్లాలో ప్రజలలో తీవ్ర ఆందోళనను సృష్టించింది. నిందితుల అరెస్ట్ పోలీసులు సమర్థవంతంగా నిర్వహించారని, ఏదైనా భయపెడుతున్న వ్యక్తుల కోసం పోలీసులు గట్టిగా చర్యలు తీసుకుంటున్నారని అధికారులు చెప్పారు.

# హైకోర్టు షాక్
# ఆశలకు బ్రేక్

## ఆరువారాల తర్వాతే ఎన్నికలు.. నైరాశ్యంలో రాజకీయ నేతలు

**ఖమ్మం, మహా:** హైకోర్టు స్థానిక ఎన్నికలకు బ్రేక్ వేయడంతో వీటిపై ఆశలు పెట్టుకున్న నేతలు, ఇప్పటికే ఖర్చయిపోయిన నేతలు ఖంగుతిన్నారు. ఈసారి ఎలాగైనా పదవి ఎక్కాలనుకున్న నేతలు.. సీన్ రివర్స్ కావడంతో నైరాశ్యంలో కూరుకుపోయారు. స్థానిక సంస్థల ఎన్నికలు, తెలంగాణ హైకోర్టు ఆదేశం కారణంగా ఆరు వారాల పాటు వాయిదా పడ్డాయి. ఈ అనూహ్య పరిణామం ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయ వాతావరణంలో పెద్ద మార్పును తీసుకువచ్చింది. జిల్లాలోని 571 గ్రామ పంచాయితీలు, 250 ఎంపీటీసీ స్థానాలు, 20 జెడ్పీటీసీ స్థానాలకు జరగాల్సిన ఎన్నికలు తెలంగాణ హైకోర్టు ఆదేశం వల్ల తాత్కాలికంగా ఆగిపోయాయి. ఈ తాత్కాలిక విరామం నాలుగు వారాల పాటు ఉంటుంది. నామినేషన్లకు సిద్ధమైన నేతలు..



హైకోర్టు బ్రేక్ తో ఒక్కసారిగా షాక్ కు గురయ్యారు.

### అయ్యో.., అయ్యయ్యో

ఎన్నికల ప్రక్రియలో ఉన్న ఉత్సాహం, హడావుడి, సభా సమావేశాలు, వ్యూహ చర్చలు ఒక్కసారిగా నిలిచిపోయాయి. కొంతమంది నాయకులు ఈ విరామాన్ని తాత్కాలిక ఊరటగా భావిస్తుంటే, మరికొందరు ఇంత వేగంగా ఉత్సాహం ఆగిపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మండలాల్లో పొత్తుల ఘర్షణలు మరియు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ తాత్కాలికంగా సడలించాయి. హైకోర్టు ఆదేశం అధికార, ప్రతిపక్ష పార్టీలన్నిటికీ తమ వ్యూహాలను పునరాలోచన చేసుకోవడానికి సమయం ఇచ్చింది. అన్ని పార్టీలు తమ వ్యూహాలను మళ్లీ రచించుకునే పనిలో పడ్డాయి. ఈ వాయిదా స్థానిక రాజకీయ దృశ్యంలో ఒక అసాధారణ పరిస్థితిని సృష్టించింది. ఈ విరామం తర్వాత, రాజకీయ ఉత్సాహం తిరిగి పుంజుకున్నప్పుడు, జిల్లా రాజకీయ దృశ్యం పూర్తిగా మారే అవకాశం ఉందని సూచిస్తోంది. ఈ పరిణామం ఖమ్మం జిల్లాలోని స్థానిక ప్రజలు, అభ్యర్థులు, పార్టీ కార్యకర్తలలో ఆసక్తిని పెంచింది.

# ఘనంగా సుందర్ లాల్ పుట్టినరోజు వేడుక

**కారేపల్లి, మహా:** వైరా మాజీ ఎమ్మెల్యే మదన్ లాల్ సోదరుడు,రిటైర్డ్ ఉద్యోగి బానోతు సుందర్ లాల్ పుట్టినరోజు వేడుకను ఆయన అభిమానులు కారేపల్లిలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన అభిమానులు మాట్లాడుతూ దయ,సేవా గుణం కలిగి ఉండి మచ్చలేని మనిషి సుందర్ లాల్ అని తెలిపారు. వృత్తిరీత్యా విశేషమైన సేవలను అందించడంతోపాటు అనేకమంది పేద కుటుంబాలకు అండగా నిలిచి సహాయం చేసిన గొప్ప మనిషి సుందర్ లాల్ అని ఆయన అభిమానులు తెలిపారు.



# నిర్దిష్ట గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

**ఖమ్మం,మహా:** ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు నిర్దిష్ట గడువు లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. గురువారం కలెక్టరేట్ లోని తన చాంబర్ లో ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్మాణ అభివృద్ధి పనులపై మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, నగరంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు సకాలంలో పూర్తికి చర్యలు చేపట్టాలన్నారు. ఇటీవల వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేస్తున్న పనులను ఇంజనీ రింగ్ అధికారులు క్షేత్రస్థాయి లో నాణ్యత ను పర్యవేక్షిం చాలని, పనులలో లోపం కనిపిస్తే ఉపేక్షించబోమని తెలిపారు. ప్రకాశ్ నగర్, గాంధీనగర్, ద్వారకనగర్, చర్చి కాంపౌండ్ రోడ్, శ్రీనివాసనగర్ ప్రాంతాల్లో పూర్తికాగా, ఎన్ఎస్పీ క్యాంపు, కొత్త బస్టాండ్, తెలంగాణ తల్లికూడలి ప్రాంతాల్లో కొనసాగుతున్న పనుల ఫోటోలను కలెక్టర్ పరిశీలించారు. ఖమ్మం నగరం అందంగా ఉంటేనే జిల్లా అభివృద్ధి కనబడుతుందని అన్నారు. సెంటర్ డివైడర్లు, సర్కిల్ లకు రంగులు వేయాలని, ప్రమాదాల సూచికలు పెట్టా లని అన్నారు. నూతన టెక్నాలజీ తో నగరంలో గుంతలు పూడిచి వేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశిం చారు. మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

